


# ఫారిన్ వెళ్ళాల(న)ండి

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

అది భారతీయుల ప్రత్యేకతో, నావాళ్ల ప్రత్యేకతో తెలియదు. కానీ అక్కడి నా పరిచితుల్లో భారతీయుల్ని కూడా ఈ విషయమై శ్రద్ధగా పరిశీలించాలనుకున్నాను.

నావాళ్లకి ఇక్కడికొచ్చే అవకాశం లేనప్పుడు – ఇక్కడున్న మనవాళ్లు మానసికంగా ఎంత ఆసరా కాగలరో తెలుసుకుందుకు నాకా ఆలోచన ఎంతగానీ సహకరించింది.

బెర్లిన్లో నాకు పరిచయమైన మొదటి భారతీయుడు గుప్తా. అతను కూడా ఇండియాలో మాతోపాటే బయల్దేరి మరెక్కడో లాంగ్వేజ్ కోర్సు ముగించుకుని ఇక్కడికొచ్చాడు. అతని ఆఫీసు కూడా నా ఆఫీసుండే ఎర్నెస్ట్ రాయిటర్ ప్లాట్జ్‌కి దగ్గర్లోనే ఉంది.

నాకతను మొదటిసారి మా ఆఫీసు ఎదుటి మయసభలో తగిలాడు.

ఇండియాలో ఉండగా కులాలు, భాషలు, యాసలు వగైరా ఎన్నో విభజనరేఖలుండొచ్చు కానీ, ఇక్కడ మాత్రం సాటి భారతీయుణ్ణి చూడగానే స్ఫురించేది మనవాడనే.

అపరిచితులైనా సరే అక్కడ భారతీయులు ఒకరికొకరు ఎదురుపడితే పలకరించి పరస్పరం పరిచయం చేసుకోవడం పరిపాటి.

మా పరిచయాలయ్యాక గుప్తా వెంటనే, “బెర్లిన్ చేరుకోగానే ముందు పోలీస్ స్టేషన్లో పేరు నమోదు చేయించుకున్నావా?” అనడిగాడు.

అప్పటికి నేను బెర్లిన్ వచ్చి అయిదారు రోజులయింది. ఏదో నేరం చేసినవాడిలా, పోలీసు స్టేషన్లో పేరు నమోదు చేయించుకోవడమేమిటో నాకు అర్థం కాలేదు.

ఈ గుప్తా లాంగ్వేజి కోర్సులో ఉండగానే ఏదో వెధవ పని చేసుంటాడు. అందుకని ఊరు మారగానే ముందు పోలీసు స్టేషనుకి వెళ్లమనుంటారు. మరి నేనేమో ల్యూనబర్గులో హొటల్ యజమాని ఫ్రౌ హెన్నీ బెక్కర్ చేత సన్మానం కూడా పొందిన ఘనుణ్ణి!

“పోలీస్ స్టేషన్‌తో మనకి పనేమిటి? ఆహ్వానంమీద వచ్చిన అతిథులం. బుద్ధిమంతులం” అన్నాను గొప్పగా, మనసులో మాత్రం అతనిపై జాలి పడుతూ.

“భలేవాడివేలే! ఇక్కడ అతిథులకో రూలూ, పౌరులకో రూలూ లేదు. ఎవరైనా సరే, ఊరు మారితే పోలీసు స్టేషన్లో పేరు నమోదు చేసుకోవాల్సిందే! అలా చేయించుకోకపోతే, అప్పుడు నిజంగా నేరస్థుడివౌతావు” అని అందుకు సంబంధించిన కొన్ని వివరాలు చెప్పాడు.

ఎవరైనా కొత్తగా ఒక ఊళ్లో ఉండడానికొచ్చినప్పుడు, అన్‌మెల్డుంగ్ (రిజిస్ట్రేషన్) ఫారం ఒకటి తీసుకుని నింపాలి. ఏ ఇంట్లో అద్దెకుంటే ఆ ఇంటి ఓనర్ చేత ఆ ఫారంలో సంతకం పెట్టించుకుని పోలీసు స్టేషనుకి వెళ్లాలి. గుర్తింపుకి కానూ విదేశీయులైతే పాస్‌పోర్ట్‌నీ, స్వదేశీయులైతే గుర్తింపుకార్డునీ చూపించాలి. అదయ్యేక అక్కడివాళ్లు – ఆ ఫారం తమకి అందినట్లు రసీదు ఇస్తారు. ఆ రసీదు దగ్గరుంటే, ఆ నగరంలో మన ఉనికి చట్టబద్ధం అన్నమాట! ఈ తతంగాన్ని అన్‌మెల్డుంగ్ (ఎన్‌రోల్‌మెంట్) అంటారు.

గుప్తా చెప్పాక నాకు గుర్తొచ్చింది.

ల్యూనబర్గు చేరినప్పుడు ఈ తతంగమంతా గ్యోతే ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో జరిగింది. వాళ్లు చెప్పింది గుడ్డిగా చెయ్యడమే తప్ప అప్పట్లో అదేమిటో పట్టించుకోలేదు. అలాగే ఊరొదిలి వెళ్లేటప్పుడు అబ్‌మెల్డుంగ్ (రిజిస్ట్రేషన్ రద్దు) తతంగం కూడా ఉంటుంది. అది కూడా ల్యూనబర్గునుంచి బయల్దేరేముందు గ్యోతే ఇన్‌స్టిట్యూట్ వారు చేయించి రసీదిచ్చారు. రసీదు దగ్గరుంచుకున్నాను కానీ దాని ప్రయోజనం ఇదని అప్పుడు నాకు తెలియదు.

ఇప్పుడు నేనా అబ్‌మెల్డుంగ్ రసీదు చూపించి, బెర్లిన్లో అన్‌మెల్డుంగ్ రసీదు తెచ్చుకోవాలి. ఆ పని బెర్లిన్ చేరిన వారం లోపల చెయ్యాలి. చెయ్యకపోతే నేరం.

ఈ విషయం ఇంతవరకూ నాకెవ్వరూ సరిగ్గా చెప్పలేదు. చెప్పినా నేను సరిగ్గా వంటబట్టించుకోలేదు. ఇప్పుడైనా అనుకోకుండా పరిచయమైన ఈ గుప్తా ధర్మమా అని విషయం తెలిసింది.

గుప్తా నాకు అన్‌మెల్డింగ్ చేసుకోవాల్సిన ఆఫీసు చిరునామా ఇచ్చాడు. నా దగ్గరున్న సిటీ మ్యాప్ సాయంతో ఆ చిరునామా పట్టుకుని, వెంటనే ఆ తతంగం పూర్తి చేసుకోగలిగాను.

ఇక్కడ ఏ పనికీ ఆఫీసుల చుట్టూ పదేపదే తిరగనక్కర్లేదు. మనకి ఉపకారం చేస్తున్నామని కాక, తమ బాధ్యత నిర్వహిస్తున్నామని అనుకోవడం ఇక్కడి ఆఫీసుల్లో ఉద్యోగుల ప్రత్యేకత.

పని జరిగేక గుప్తాని కలుసుకుని ధన్యవాదాలు చెప్పి, “నువ్వు చెప్పకపోతే ఈ విషయం నాకు తెలిసేది కాదు. ఐనా తప్పు నాది. నీకు తెలిసిన విషయం నాకు తెలియలేదంటే, ఎక్కడో నావల్ల అలక్ష్యం జరిగుండాలి కదా!” అన్నాను.

గుప్తా నవ్వి, “అలా అనుకోకు. ఈ విషయం పక్కాగా నేను తెలుసుకోగలిగానంటే అందుకు కారణాలున్నాయి. రెండు మూడు నెలల్లో మా ఆవిడ, కొడుకు వస్తున్నారిక్కడికి” అన్నాడు.

ఆ మాటలు నా చెవులకి అమృతోపమానమయ్యాయి. అంటే – డాడ్ స్కాలర్సు కూడా భార్యాబిడ్డల్ని ఇక్కడికి రప్పించుకునే అవకాశమున్నదన్నమాట!

నాలో కుతూహలం రేగింది. వాళ్లని తీసుకురావడానికి తనేం చేస్తున్నాడో వివరాలడిగాను.

అడిగినప్పుడు ఎంత ఉత్సాహంగా అడిగానో, అతను చెప్పింది విన్నప్పుడు అంతగానూ హతాశుడినయ్యాను.

ఇండియానుంచి జర్మనీ రావడానికి టికెట్టు మనిషికి ఐదువేల రూపాయలుట. అదీ అట్నించి ఇటు రావడానికి. తిరుగు ప్రయాణం ఖర్చు వేరే.

గుప్తా భార్యకి టికెట్ – గుప్తా తండ్రి కొంటున్నాట్ట. అలా టికెట్ కొని శ్రీమతిని పంపగల ఆర్థిక స్తోమతు మా ఇంట్లో అటూ ఇటూ ఎవరికీ లేదు.

అదలా ఉంచితే గుప్తాకి హాస్టల్లో వన్ బెడ్రూం ఎకామడేషన్ దొరికింది. అద్దె నెలకి మూడొందల మార్కులు. గుప్తాకి ఒక్కడే కొడుకు. వయసు ఏడాది లోపు. ఇక్కడి రివాజు ప్రకారం దంపతులొక గదిలోనూ, పిల్లలు ఒకొక్కరు ఒకో గదిలోనూ పడుకోవాలి. గుప్తా కొడుకు చంటిపిల్లాడని సింగిల్ బెడ్రూం అపార్టుమెంట్లో ఉండడానికి హాస్టలువాళ్లు ఒప్పుకున్నారుట. అది అతని అదృష్టం.

ఇద్దరు పిల్లలుంటే సాధారణంగా త్రీ బెడ్రూం హౌస్ తీసుకోవాలి. కొంచెం కన్సెషనిచ్చినా, ఎట్టి పరిస్థితుల్లోనూ బెడ్రూమ్స్ రెండుకి తగ్గకూడదు. ఇక్కడ అలాంటి ఇంటికి అద్దె ఐదారొందల మార్కులుంటుంది. అప్పుడు నాకొచ్చే ఆదాయానికీ, అప్పటి నా బాధ్యతలకీ అది చాలా ఎక్కువ.

“నావాళ్లని ఇక్కడికి రప్పించడం నా శక్తికి మించిన పని” అనుకున్నాను.

అలాగని దిగాలు పడిపోలేదు. మొదట్నించీ నాది ఉన్నంతలో సద్దుకుపోయి సంతోషాన్ని వెదుక్కునే మనస్తత్వం. ఆ దృక్పథంలో చూస్తే –

జర్మనీలో స్టయిపెండ్ బట్వాడా – కొంత చిత్రంగానూ, కొంత సంతోషంగానూ అనిపించింది నాకు.

ఇండియాలో నాకు స్టయిపెండయినా, జీతమైనా ఆ పైనెలలో మొదటిరోజున ఇచ్చేవారు. ఆ రోజు సెలవైతే ఆ మరుచటి రోజు ఇచ్చేవారు. కానీ ఇక్కడ ఏ నెల స్టయిపెండ్ ఆ నెల మొదటి రోజునే ఇస్తున్నారు. అంటే ముందు డబ్బిచ్చి తర్వాత పని చేయించుకోవడం అన్నమాట! ఆ రోజు సెలవైతే, అందుకు ముందురోజు ఇస్తున్నారు.

ల్యూనబర్గులోనూ అలాగే జరిగింది. బెర్లిన్లోనూ అంతే!

అక్టోబర్ ఒకటిన మయసభకి వెళ్లి మొదటిసారి స్టయిపెండ్ తీసుకుంటున్నప్పుడు, స్కాలర్‌షిప్పుకి గానూ తొమ్మిదొందల మార్కులూ, చలికి దుస్తులు కొనుక్కుందుకు మరో మూడొందల మార్కులూ – వెరసి పన్నెండొందల మార్కులు వచ్చాయి.

ఇండియాలో రూపాయల్లోనే అప్పటికి నాకంత జీతం లేదు. చాలా సంతోషంగా అనిపించింది.

ఆ సంతోష సమయంలో పరిచయమయ్యాడు గోపాలకృష్ణన్.

అతను అలెగ్జాండర్ వాన్‌హుంబోల్‌డ్‌ట్ ఫెలోషిప్‌మీద వచ్చాడు. అది చాలా ప్రతిష్ఠాత్మకమైన ఫెలోషిప్. నాకొచ్చేదానికి రెట్టింపు స్టయిపెండ్ వస్తుందతనికి. అతను తమిళుడే కానీ తెలుగు కూడా వచ్చు. తన పూర్వీకులు తెలుగువారేనని చెప్పాడు.

అతని ద్వారానే నాకు ఓంప్రకాష్ మహాపాత్రా పరిచయమౌతాడనీ, ఆ పరిచయం నా బెర్లిన్ జీవితానికి ఊహించని మలుపు తెచ్చిపెడుతుందనీ అప్పుడు నాకు తెలియదు.

గోపాలకృష్ణన్‌కి మయసభ అంటే భయమట. అందులోకి వెడితే తప్పిపోతానని బెంగట.

“ప్రతినెలా స్టయిపెండ్ తీసుకుందుకు మనమిద్దరం కలిసి వెడదాం. ఒకరికొకరు తోడుంటే ధైర్యంగా ఉంటుంది” అన్నాడతను. సరేనన్నాను.

గోపాలకృష్ణన్ వయసులో నాకంటే పెద్ద. కానీ పెళ్లి ఈ మధ్యనే అయింది. ఇంకా పిల్లలు లేరు. మనిషి సరదాగా ఉంటాడు కానీ బాగా బిడియస్థుడు. ఎంత బిడియమంటే భార్యను ఈ దేశం తీసుకురావడానికి మొహమాట పడుతున్నాడు.

అతని సమస్యేమిటో నాకు సరిగ్గా అర్థం కాలేదు, “ఇంకా పిల్లలు లేరు కదా, మీ ఆవిణ్ణిక్కడికి రప్పిస్తే, ఇద్దరికీ సరదాగా హనీమూన్ ఐపోతుంది” అన్నాను సరదాగా అన్నట్లు.

కానీ అతను ముఖం చిట్లించి, “నాకే ఇక్కడ దినదినగండంగా ఉంది. మళ్లీ వేరే తంటసమెందుకూ?” అన్నాడతను.

‘భార్య తంటసమా? ఇలా అనుకునేవారు కూడా ఉంటారా? ఉంటే అలాంటివాళ్లు పెళ్లి చేసుకోవడమెందుకు?’ అనుకున్నాను కానీ – అది అపార్థమని తెలుసుకుందుకు ఎంతోసేపు పట్టలేదు.

అతను బాగా బిడియస్థుడు. ఎవరో ఒకరు తోడు లేకుండా, ఇల్లు దాటి – అడుగు తీసి అడుగు వెయ్యడానికి కూడా భయంగా అనిపిస్తోందిట. అలాంటి పరిస్థితుల్లో భార్యని ఇరికించడం సబబు కాదని అతడికి తోచింది.

“మరీ అంత భయమైతే – ఎన్నాళ్లని ఇక్కడుండగలరు?” అన్నాను.

“అదీ నిజమే! నేనిక్కడికి రావడం పొరపాటనీ, వెనక్కి వెళ్లిపోదామనీ కూడా నాకు అనిపించింది. కానీ అనుకోకుండా ఓంప్రకాష్ మహాపాత్రా పరిచయమయ్యాడు. దాంతో నా ఆలోచనలు మారాయి” అన్నాడు.

అంత మంచి స్కాలర్‌షిప్పు మీదొచ్చి, అలా వెళ్లిపోవాలనుకున్నాడని నాకు చాలా చిత్రంగా అనిపించింది. కానీ మహాపాత్రా పేరు వినగానే ఆ ఆశ్చర్యం పోయి, ఆ స్థానాన్ని ఉత్సాహం ఆక్రమించింది.

మహాపాత్రా ఒరియావాళ్ల ఇంటిపేరు. అప్పటికి ఒరిస్సాలో ఐదారేళ్లుగా ఉన్నాను. నాకు ఒరియా రాదు కానీ – ఆ ప్రాంతంతోనూ, అక్కడివారితోనూ, ఆ భాషతోనూ చెప్పుకోతగ్గ అనుబంధం ఏర్పడింది. ఎంతలా అంటే ఇప్పుడు మహాపాత్రా పేరు వినగానే ఆత్మీయుల ప్రస్తావన వచ్చినట్లనిపించింది.

“ఓంప్రకాష్ మహాపాత్రా ఎవరు?” అన్నాను కుతూహలంగా.

“మంచివాడు. స్నేహపాత్రుడు. అతన్ని నీకు పరిచయం చేస్తాను” అన్నాడు గోపాలకృష్ణన్.

తక్షణమే పరిచయం చేసుకోవాలనిపించింది కానీ – అందుకు కనీసం ఒక్క రోజు ఆగాలని తెలుసు. కానీ ఒక్కరోజు మాత్రమే ఆగాల్సిరావడం నా అదృష్టం.

నేను భువనేశ్వర్నించి వచ్చేనని తెలియగానే, ఓంప్రకాష్ మర్నాడే ఎంతో ఉత్సాహంగా నన్ను కలుసుకుందుకు వచ్చాడు. ఐతే నాకు ఒరియామీద పట్టు లేదనీ, ఆ భాషలో మాట్లాడ్డం కూడా రాదనీ తెలియగానే – అతని ఉత్సాహంమీద కాసిని నీళ్లు చిలకరించినట్లయింది.

"కనీసం మాట్లాడుకునే స్థాయిలో భాష నేర్చుకోవలసింది" అని నేనూ మనసులో కించపడ్డాను.

ఓంప్రకాష్ ఇండియానుంచి కెనడా వెళ్లి అక్కడ ఎమ్మెస్ చేసి పిహెచ్‌డి చెయ్యడానికి బెర్లిన్ వచ్చాడు. చురుకైనవాడు. విదేశానుభవంలో నాకంటే పెద్దే కానీ, వయసులో నాకంటే కాస్త చిన్న.

అతను నా అలవాట్ల గురించి తెలుసుకుని, "ఇక్కడికొచ్చి ఇంకా బీరు కూడా అలవాటు చేసుకోలేదా? యూ ఆర్ గ్రేట్!" అన్నాడు.

జర్మనీలో నా అలవాట్లని మెచ్చుకున్న తొలి భారతీయుడతను. అందులోనూ నాకు లేని అలవాట్లన్నీ తనకి ఉన్నాయి. ఐనా నన్ను గ్రేట్ అన్నాడని, నేను నిజంగానే గ్రేట్ కాబోలనుకుని చాలా సంతోషించాను. తర్వాత గ్రహించాను – ఎవరినైనా, దేన్నయినా మెచ్చుకుందుకు 'గ్రేట్'ని ఊతపదంగా వాడడం అతని అలవాటని.

ఓంప్రకాష్‌తో పరిచయమయ్యేసరికే నేను నా జర్మన్ మిత్రుడు మ్యుల్లర్ సాయంతో గ్రుండిగ్ కంపెనీది స్పూల్‌టైపు స్టీరియో టేపు రికార్డర్ కొన్నాను. అది ఓంప్రకాష్‌కీ, గోపాలకృష్ణన్‌కీ కూడా నచ్చింది. ఇంత త్వరలో అంత ఖరీదైనది కొన్నందుకు కూడా ఓంక్రాష్ నన్ను గ్రేట్ అన్నాడు.

నేను, ఓంప్రకాష్ తరచుగా కలుసుకునేవాళ్లం. ఓసారి నన్నతను తనింటికి భోజనానికి ఆహ్వానించాడు. "ఈరోజు నీతోపాటు నేనూ ఫక్తు శాకాహారం" అన్నాడు. ముందు ఓ గిన్నెలో అన్నం వండి పక్కన పెట్టాడు. తర్వాత ఓ బూరెల మూకుడులో జీలకఱ్ఱ పోపు వేయించాడు. ఫ్రిజ్‌లోంచి ఓ డబ్బా తీసి సీలు తెరిచాడు. దాంట్లో నూనెలో నిలవుంచిన రకరకాల కూరగాయల ముక్కలున్నాయి. వాటిని పోపులోకి వంపి గరిటతో కలుపుతూ కాసేపు వేయించి దింపేశాడు. ఆ కూర చాలా చాలా బాగుంది. నేనా కూరగాయల డబ్బా తీసుకుని పేరు చూశాను. గ్యువెట్ష్ అని ఉంది. ఆ తర్వాత నుంచి నేను వండుకునే కూరల్లో గ్యువెట్ష్ కూడా చేరింది.

మాటల సందర్భంలో – సమయం దొరికినప్పుడల్లా సిటీ మ్యాప్ సాయంతో నేను బెర్లిన్ నగరాన్ని ఓసారి చుట్టి వస్తున్నానని తెలిసిన ఓంప్రకాష్ – మళ్లీ నన్ను గ్రేట్ అన్నాడు. అప్పుడు గ్రేట్ కేవలం ఊతపదం కాదు. తన సాయంలేనిదే ఒక్కడుగైనా వెయ్యలేని గోపాలకృష్ణన్ మనసులో స్ఫురించగా అప్రయత్నంగా అతని నోట వెలువడిన మాట!

ఓంప్రకాష్‌కి ఆటలు, సంగీతం, రాజకీయాలు వగైరాలపై ఆసక్తి, చెప్పుకోతగ్గ అవగాహన ఉంది. నేను చెప్పేది వింటూ, తనకు తెలిసినవి ఎన్నో చెప్పేవాడు. చాలా విషయాల్లో మా అభిప్రాయాలు కలిసినట్లే అనిపించేది. అందువల్లనేమో మామధ్య మాటలు బాగా నడిచేవి.

ఏం మాట్లాడుకున్నా అనుకోకుండా నా భార్యాబిడ్డల ప్రసక్తి తెచ్చేవాణ్ణి.

నాకూ మావాళ్లకీ ఉన్న అనుబంధం ఓంప్రకాష్‌కి అర్థమైనట్లుంది. అతనొక రోజున, "మీవాళ్ల గురించి ఆలోచిస్తూ నీరసపడే బదులు, వాళ్లని ఇక్కడికి తీసుకొచ్చే ప్రయత్నం చేయొచ్చుగా" అన్నాడు.

జవాబుకి తడుముకోవాలా, "నాకిద్దరు పిల్లలున్నారు. ఇద్దరూ ఇంకా బాగా చిన్నపిల్లలు. తల్లో తండ్రో ఎవరో ఒకరైనా దగ్గరుండాలి. వాళ్లనొదిలి తనొక్కత్తీ ఇక్కడికి రావడం – తనకీ, నాకూ కూడా మనస్కరించదు. " అన్నాను.

"అలా ఎందుకనుకోవాలి? పిల్లల్ని దేశంలో వదిలి ఇక్కడికొస్తున్న ఇండియన్సు చాలామందే ఉన్నారు" అన్నాడు ఓంప్రకాష్.

"ఆ విషయం నాకూ తెలుసు. కానీ అలా చెయ్యడానికి – నేనూ, నా భార్యా కూడా మానసికంగా సిద్ధపడి లేం" అని స్పష్టం చేశాను.

అతను సాలోచనగా, "ఈ విషయమై బాగా ఆలోచించి ఓ నిర్ణయం తీసుకుని చెప్పు. నాకు చేతనైన సాయం చెయ్యడానికి నేను రెడీ" అన్నాడు.

స్నేహభావంతో ఓ మంచిమాట అన్నాడనుకున్నాను. అతని మాటల్ని సీరియస్‌గా తీసుకోలేదు కానీ అవి నా బుర్రలో ఏ మూలో స్థిరనివాసం ఏర్పరచుకున్నాయని అప్పుడు తెలియలేదు.

అక్టోబర్ 21న నేను కలకత్తాలో ఉంటున్న అన్నయ్యకి యోగక్షేమాల ఉత్తరం రాసి కవరు అంటించబోతుండగా – ఉన్నట్లుండి ఓంప్రకాష్ మాటలు గుర్తొచ్చాయి.

అతను పిల్లల్ని ఇండియాలో వదిలి శ్రీమతిని ఇక్కడికి రప్పించుకోమని సలహా ఇచ్చాడు. అందుకు తన వంతు సాయం చెయ్యగలనన్నాడు.

అంతవరకూ ఈ విషయంలో నాకు ఆ మాత్రం మాట సాయం అందించినవారు లేరు. ఆ మాటని ఆసరా చేసుకుని, శ్రీమతితో పాటు పిల్లలిద్దర్నీ కూడా ఇక్కడికి రప్పించే ప్రయత్నం నేను చెయ్యొచ్చుగా!

'ఆరంభింపరు నీచ మానవులురు విఘ్నాయాస సంత్రస్తులై' అంటుంది సుభాషితం. ఇంతవరకూ నేను నీచావస్థలో ఉన్నాను.

'ఆరంభించి పరిత్యజించుదురురు విఘ్నాయత్తులై మధ్యముల్' అంటుంది సుభాషితం. మధ్యముడిగా మిగిలిపోవడంకంటే నీచావస్థే మెరుగనుకునే మనస్తత్వం నాది.

'ధీరుల్ విఘ్ననిహన్య మాన్యులగుచున్ ధృత్యున్నతోత్సాహులై ప్రారబ్ధార్థము లుజ్జగింపరు' అంటుంది సుభాషితం. అంతవరకూ ధీరుణ్ణి కావాలన్న ఆలోచన ఒక్కసారైనా కలగలేదు. ధీరుణ్ణి కావాలన్న దృఢసంకల్పముంటే – ఆ లక్ష్యసాధనలో మధ్యముడిగా మిగిలిపోయినా చిన్నతనం కాదు.

అప్పుడు నాకు అర్థమైంది. నా ఆలోచన మారాలని.

నావాళ్ళని ఇక్కడికి రప్పించుకోవచ్చని ఆ రోజున మొదటిసారిగా నాకు స్ఫురించింది. కాసేపట్లోనే ఆ స్ఫురణ ఇంతై అంతై బలమైన నిర్ణయంగా మారిపోయింది.

వెంటనే అన్నయ్యకు రాసిన ఉత్తరంలో చివర కొన్ని వాక్యాలు కలిపాను. శ్రీమతినీ, పిల్లల్నీ కలకత్తా రప్పించి – పాస్‌పోర్ట్, వీసా వగైరా తతంగాలు చూడమని.

అదే ఊపులో బాన్ నగరంలో ఉండే డాడ్ ఆఫీసుకి కూడా ఓ ఉత్తరం వ్రాశాను – నా భార్యాబిడ్డల్ని బెర్లిన్ రప్పించుకోవాలనుకుంటున్నానని. వారికి ముందుగా తెలియబర్చడం నా కర్తవ్యం.

ఆ తర్వాత నేను తీసుకున్న నిర్ణయాన్ని ఆఫీసులో డెకర్ట్‌కి చెప్పాను. ఆ విషయమై అప్పటికి నేననుకుంటున్న సమస్య – భార్య, ఇద్దరు పిల్లలతో ఉండడానికి తగిన ఇల్లు దొరకడం ఒక్కటే!

డెకర్ట్ నా నిర్ణయానికి చాలా సంతోషించాడు. ఇంటి విషయమై సలహా కోసం వెంటనే నన్ను ఆఫీసు సెక్రటరీ ఫ్రౌ షింగే వద్దకి తీసుకెళ్లాడు.

షింగే నా కథ విని, "ఇద్దరు పిల్లలా? మీ బడ్జెట్లో ఇల్లు దొరకడం కాస్త కష్టమే" అని నిట్టూర్చింది.

ఆ ఒక్క మాట చాలు – 'ఉరు విఘ్నాయత్తులై ఆరంభించి పరిత్యజించే' మధ్యముల జాబితాలో నన్ను చేర్చడానికి. కానీ 'ప్రారబ్ధార్థము లుజ్జగింపని' ధీరుణ్ణి కావాలన్న మత్తులో ఉన్నాను నేను.

షింగే మాటల్ని పక్కన పెట్టాను. ఆ తర్వాత ఓంప్రకాష్‌ని కలుసుకున్నప్పుడు, “నీ మాట స్ఫూర్తితో ముందుకెడుతున్నాను. నువ్వేం సాయం చెయ్యగలవో చెప్పు” అన్నాను.

ఆతను ముందు సాయం గురించి చెప్పలేదు. “నీ నిర్ణయం మంచిదే కానీ, పిల్లలతో ఇక్కడుండడంలో చాలా ఇబ్బందులుండొచ్చు. బాగా ఆలోచించుకో” అని హెచ్చరించాడు.

ధీరుణ్ణి కదా, “అన్నీ ఆలోచించే ఈ నిర్ణయానికొచ్చాను” అన్నాను దృఢంగా.

“మంచిది. ఇల్లు వెదకడంలో నేను చెయ్యగల సాయం చేస్తాను” అన్నాడతను అప్పుడు.

ముందు నేను చెయ్యాల్సినవి ఒకటొక్కటిగా పూర్తి చెయ్యాలిగా. వాటిలో బెర్లిన్లోని ఇండియన్ కన్సలే◌ేట్ ఆఫీసుకి వెళ్లడం ఒకటి. నేను జర్మనీలో ఉంటున్నాననీ, అక్కడ నా భార్యాబిడ్డల్ని పోషించుకునే స్తోమత నాకున్నదనీ కన్సలేట్ వారో సర్టిఫికెట్ ఇవ్వాలి. అదుంటే తప్ప ఇక్కడికి రావడానికి నావాళ్లకి అనుమతి లభించదు.

ఇండియన్ ఆఫీసు అనేసరికి అది తాలూకాఫీసైనా, ఇండియన్ కన్సలేట్ ఐనా ఒకటే. ఇండియాలో ఉన్నా జర్మనీలో ఉన్నా ఒకటే!

“పాస్‌పోర్ట్ ఇక్కడ వదిలి వెళ్లండి. సర్టిఫికెట్టుకి ఓ వారం రోజులు పట్టొచ్చు” అందక్కడ పనిచేసే అమ్మాయి – ఫక్తు ఇండియన్ ఉద్యోగిలా.

నేనక్కడ నా పాస్‌పోర్ట్ వదిలి ఇంటికెళ్లాను.

ఈలోగా డాడ్ ఆఫీసునుంచి నాకో కవరొచ్చింది. అది విప్పి చదవడానికి భయపడ్డాను. ఎందుకంటే –

జర్మన్లకొక జీవనప్రమాణ వ్యయముంది. ఆ ప్రకారం జర్మనీలో ఉండడానికి ఒక మనిషికి కనీసం నెలకి ఎనిమిదొందల మార్కులు అవసరం. ఆ ప్రకారం అప్పుడు నాకొస్తున్న డాడ్ స్కాలర్‌షిప్ ఒక్క మనిషికే సరిపోతుంది. అందుకని డాడ్ సంస్థ – డాడ్ స్కాలర్సు భార్యాబిడ్డల్ని ఇక్కడికి రప్పించుకోవడాన్ని ప్రోత్సహించకపోవడం సాధారణం. ఎవరైనా తమవాళ్లని రప్పించుకుంటామని వ్రాసినప్పుడు – ఖర్చు విషయం చెప్పి హెచ్చరించడం డాడ్‌కి రివాజు.

నేను ధీరుణ్ణి కావాలనుకుంటున్నాను కానీ, పదే పదే విఘ్నాలెదురౌతుంటే తట్టుకోలేక మధ్యముడిగా మారిపోతానన్న భయమూ ఉంది. ఆ భయంతోనే కవరు తెరిస్తే –

అందులో రెండుత్తరాలున్నాయి. మొదటిది నాకున్న అలవెన్సుల గురించి.

భార్యాబిడ్డలు ఇక్కడికొస్తే – భార్యకి 200 మార్కులు, పిల్లలకి చెరో యాభై మార్కులూ అదనపు అలవెన్సుగా ఇస్తారుట.

ఆ విషయం నాకు తెలుసు. నా స్కాలర్‌షిప్ ఆర్డర్లో ఆ విషయం ప్రస్తావించారు. కానీ ఇప్పుడా విషయం నేను వ్రాసిన ఉత్తరానికి జవాబుగా రావడం – నాకు కొత్త ఉత్సాహాన్నిచ్చింది. అంటే డాడ్ సంస్థ ఈ విషయంలో నన్ను ప్రోత్సహించినట్లే అనిపించింది.

ఇక రెండో ఉత్తరంలో విశేషం నేనూహించనిది!

ఈ అక్టోబరునుంచి స్టయిపెండ్ వంద మార్కులు పెంచారుట. అంటే తొమ్మిదొందలనుంచి వెయ్యి మార్కులు అయింది. తర్వాతి నెలలో ఆ ప్రకారం అరియర్సు కూడా ఇస్తారుట.

అంతే, నాలోని ధీరుడు ధ్రుత్యున్నతోత్సాహుడైపోయాడు.

శ్రీమతిని ఇక్కడికి తీసుకురావాలని నేననుకున్న ఘడియ శుభప్రదమై ఉండాలి. లేకపోతే నా ఉత్తరానికి ఇలాంటి జవాబు రావడమేమిటి?

బలహీన క్షణాల్లో సామాన్యుడికి బలాన్నిచ్చేది నమ్మకం. ఆ నమ్మకానికి ఒకోసారి మూఢత్వమూ జతపడొచ్చు.

ఏదేమైనా నాకప్పుడు బలం కావాలి. వెంటనే న్యూమరాలజీ లోకి వెళ్లాను.

నేను డాడ్ వాళ్లకి 31న ఉత్తరం వ్రాశాను. తేదీని తిరగేస్తే పదమూడు. డాడ్‌నుంచి నాకొచ్చిన ఉత్తరం తేదీలోని అంకెలన్నీ కలిపినా పదమూడొచ్చింది. పదమూడు నా లక్కీ నంబర్.

ఇవన్నీ కలిగించిన ఉత్సాహంతో ఆలోచనలకి పదును పెడితే అందులోకి ఒలోముచ్‌కీ వచ్చింది.

నేనిప్పుడుంటున్నది సింగిల్ బెడ్రూమే కానీ, చూడ్డానికి పెద్ద హాలులా ఉంటుంది. ఒలోముచ్‌కీ ఒప్పుకుంటే నేను, నా భార్యాబిడ్డలు – మొత్తం నలుగురం ఆ హాల్లో సంతోషంగా సద్దుకోగలం. నాకున్న స్వల్ప పరిచయంలో ఒలోముచ్‌కీ మంచిదానిలాగే అనిపించింది.

ఒక రాయేసి చూస్తే సరిపోదా అనిపించింది. ఐతే అక్కడో చిన్న తిరకాసుంది.

అంతకుముందే ఒకరోజున ఒలోముచ్‌కీ నూటయాభై మార్కులు అప్పుగా కావాలని వంటింట్లో ఫ్రిజ్‌మీద కాగితం పెట్టి వెళ్లింది. మా ఇద్దరికీ అదే పోస్టుబాక్స్.

అప్పుడు నా దగ్గర డబ్బు లేదని చీటీ వ్రాసి ఫ్రిజ్‌మీద పెట్టాను. అందుకామెకి ఆగ్రహం వచ్చిందో లేదో తెలియదు కానీ, వస్తే ఆశ్చర్యంలేదు.

మరి నాకిప్పుడామె అనుగ్రహం కావాలి. పాత్రుణ్ణి కాగలనా?

కానీ ధీరుణ్ణి కదా – సంకోచం కూడదు. తనొప్పుకుంటే నా భార్యాబిడ్డల్ని బెర్లిన్ రప్పించాలనుకుంటున్నట్లు చీటీ ఒకటి వ్రాసి ఆ రాత్రి ఫ్రిజ్‌మీద పెట్టాను.

ఒక ఏడాదిపాటు నేను నా కుటుంబంతో కలిసి ఉండే అవకాశం – ఆ నా విన్నపానికి ఒలోముచ్‌కీ ఎలా స్పందిస్తుందీ అన్నదానిపై ఆధారపడి ఉంది.

ఒప్పుకుంటుందా?

అది నాకు బలహీన క్షణం. అలాంటి బలహీనక్షణాలు నాకు చాలా అరుదు.

చిన్నప్పట్నించీ దేవాలయాల మధ్య పెరిగాను. పెద్దలు చేసే దైవపూజలకు నా వంతు సహకారాన్నందిస్తూ వచ్చాను. కానీ నా ఉద్దేశ్యంలో దేవుడంటే కోరికలు తీర్చే పురుషోత్తముడు కాదు. మనిషి ఎంత అల్పుడో తెలుసుకుందుకు సహకరించే ఓ తత్వం. అందుకే పరీక్షల్లో కూడా నేను దేవుడికి చేతులు జోడించానే తప్ప, ఏదో కావాలని కోరాలనుకునేవాణ్ణి కాదు.

అలాంటి నాకు – బీయస్సీ ఫైనలియర్ పరీక్షల సమయంలో ఓ బలహీనక్షణం వచ్చింది. ఆ వివరాలు మా 'పెళ్లయ్యాక చూడు' నవల్లో ఉన్నాయి.

అప్పుడా బలహీనక్షణంలో నేను చేసిన పనేమిటంటే – దీర్ఘకాలిక పథకంలో బోలెడన్ని కోరికలకి ఒకదానితో ఒకటి లంకె పెట్టి, తిరుపతి వెంకన్నకి మొక్కుకున్నాను.

ఆశ్చర్యంగా ఆయన చాలా ఓపికగా అన్నింటినీ కలిపి తీర్చాడు. నేను నడిచి కొండెక్కి ఆ మొక్కు తీర్చుకున్నాను.

ఇప్పుడు మళ్లీ అలాంటి బలహీనక్షణం వచ్చింది. బెర్లిన్ నగరంలో ఏడాదిపాటు నా భార్యాబిడ్డలతో గడపాలన్న కోరిక ఇంతింతై అంతైంది. ఒలోముచ్‌కీ నా భార్యాబిడ్డల రాకకు ఆమోదముద్ర వేసేలా చెయ్యమని – మరోసారి నన్ను తిరుపతి వెంకన్నకి మొక్కుకునేలా చేసింది.

అందుకే మేధావులమని మిడిసిపడే మనలాంటివార్ని చూసి దేవుడు నవ్వుకుంటాడు. నవ్వుకుంటూనే తనున్నానన్న భ్రమని కలుగజేసి మనని మరింత అయోమయంలో పడేస్తాడు.

మర్నాడుదయం కాస్త పెందరాళే లేచి వంటింట్లోకి వెళ్లి చూస్తే ఫ్రిజ్‌మీద ఏ కాగితం లేదు.

అంటే, ఒలోముచ్‌కీ నా చీటీ తీసుకుంది. కానీ ఇంకా బదులివ్వలేదు. ఎందుకో మరి?

ఆలోచిస్తూనే మళ్లీ గదిలో దూరి తలుపేసుకున్నాను. అంతలోనే గది తలుపు కొట్టిన చప్పుడు. ఆ వెంటనే, "హెర్ డాక్టర్" అంటూ ఒలోముచ్‌కీ గొంతు.

డాక్టర్ పదానికి హెర్ (మిస్టర్) జోడించడం అక్కడ మామూలే.

తలుపు తీశాను. ఆమెననుసరించి ఆమె గదిలోకి వెళ్లాను.

"నువ్వు నీ భార్యాబిడ్డల్ని రప్పించుకుని నా ఇంట్లో ఉండడానికి నాకే అభ్యంతరం లేదు. నీ గదిలో అదనంగా మరో మంచం వేయిస్తాను. అందుకుగానూ నెలకి వంద మార్కులు అదనంగా ఇవ్వాలి" అందామె.

'కంటి నఖిలాండ కర్త నధికుని గంటి' అని మురిశాడు అన్నమయ్య. 'కనుగొంటిని' అని పరవశించాడు త్యాగయ్య.

కారణజన్ముల అలౌకికానందానికి అపూర్వ ప్రకటన అది.

కారణజన్ములు కానివారికీ అలాంటి అలౌకికానందం ఉంటుందని అప్పుడు నాకు అర్థమైంది.

ఒప్పుకుంది.

ఒలోముచ్‌కీ ఒప్పుకుంది.

అది కలో, నిజమో – అనుకుంటూ ఆమెని మరోసారి పరీక్షగా ఆమెని చూస్తే, చేతిలో మాణిక్యవీణ కనిపించింది.

కానీ నా మనసు స్తోత్రానికి పూనుకోలేదు. దానినిండా పామరుడి ఆలోచనలు.

ఇంతవరకూ నా ఇంటద్దె నూటయాభై. అదిప్పుడు రెండొందల యాభై ఔతుంది. ఐతే ఏం – నలుగురున్న నా కుటుంబానికి నాలుగొందల మార్కుల లోపులో ఎవరూ ఇల్లివ్వరక్కడ. అదృష్టమంటే నాదే!

ఇలా అనుకుని నా దృష్టిని ఆమె చేతులనించి ముఖంమీదకు మళ్లిస్తే, ఆమె కళ్లలో కూడా నా కున్నంత ఆత్రుతా కనిపించింది.

గదిలో ఒక్క మంచం అదనంగా వేయించినందుకు తనకి నెలకి మరో వంద మార్కులు. అదృష్టం ఆమెది కూడా మరి! అందుకే ఆమె కళ్లలో ఆత్రుత!

దేవుడు ప్రత్యక్షమై వరమివ్వగానే ముందు పరవశం కలుగుతుంది. తర్వాత వచ్చిన అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవాలన్న ఆశ మొదలౌతుంది.

ఆ ఆశ నాకు ఆమె కళ్లలోని ఆత్రుతని పట్టిచ్చింది.

"నేను ఉద్యోగం చెయ్యడం లేదు. స్కాలర్‌షిప్పుమీద ఉంటున్నాను. ఎలాగో కష్టపడి కొంచెండబ్బు నిలవేశాను. నా భార్యాబిడ్డల్ని రప్పించుకుందుకు కూడా, ఇప్పుడు ఆ నిల్వలోంచే ఇక్కడ టికెట్ కొని ఇండియాకి పంపాలి" అన్నాను దీనంగా.

నటించక్కర్లేదు. అప్పుడు నా పరిస్థితి నిజంగానే దీనంగా ఉంది.

"ఐతే ఏమంటావ్?" అంది ఒలోముచ్‌కీ.

"గదిలో అదనంగా మంచం వేయించినందుకు, నెలకి యాభై మార్కులకి మించి అద్దె ఇచ్చుకోలేను" అన్నాను.

ఒలోముచ్‌కీ ఒప్పుకోలేదు. కానీ ఆమె గొంతు కాస్త మెత్తబడింది. వెంటనే ఒప్పుకోవడం ఇష్టంలేక అలాగంటోంది కానీ, ఒప్పుకుంటుందని నాకు అనిపించింది.

యాభై మార్కులకి మించి ఇవ్వలేనని మరీ మరీ చెప్పాను.

మామూలుగా మొహమాటస్థుణ్ణి. బేరసారాలకు బొత్తిగా పనికిరానని – చిన్నప్పుడు కన్నతల్లి, పెద్దయ్యాక కట్టుకున్న ఇల్లాలు నా గురించి ఒకే తీర్మానం చేశారు.

ఎదిగేక కన్నబిడ్డలూ అదే అభిప్రాయానికొస్తారని నాకే అనుమానముంది.

కానీ ఆ క్షణంలో తిరుపతి వెంకన్న నన్నావహించి ఉన్నాడనుకోవాలి. ఆయన ప్రభావమే ఒలోముచ్‌కీపై పడుతోందనుకోవాలి.

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments